సాక్షి
సిద్దిపేట
శుక్రవారం । 21 । జూన్ । 2024



ఉపయోగాలెన్నో..

రోజూ ఒక గంట యోగాకు కేటాయిస్తే యోగం కలుగుతుందని పెద్దలు చెబుతున్నారు. శుక్రవారం యోగా డే సందర్భంగా ప్రత్యేక కథనం.

వివరాలు 8లో ▶

ఈ మున్సిపల్ కమిషనర్ మాకొద్దు!

రాష్ట్ర అధికారులకు కౌన్సిలర్ల ఫిర్యాదు

సిద్దిపేటజోన్: ఇటీవల కౌన్సిల్ సమావేశం సందర్భంగా కమిషనర్‌ను వేదిక నుంచి కిందికి దించిన వివాదం ముదురుతోంది. గురువారం కొందరు కౌన్సిలర్లు నేరుగా హైదరాబాద్‌కు వెళ్లి మున్సిపల్ కమిషనర్‌ను బదిలీ చేయాలని, కౌన్సిలర్లకు గౌరవం ఇవ్వడం లేదని రాష్ట్ర మున్సిపల్ డైరెక్టర్, రీజినల్ డైరెక్టర్ లకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. కాగా, పత్రికల్లో వచ్చిన కథనాలు, ఒక వర్గం ఫిర్యాదు మేరకు మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి బుధవారం గోప్యంగా సిద్దిపేటలో విచారణ చేశారు. మరోవైపు మంగళవారం నుంచి మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి సెలవులపై వెళ్లడం విశేషం.

న్యూస్‌రీల్

నేడు యోగా దినోత్సవం

- హాజరుకానున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఎల్లమ్మ చెరువు కట్టపై మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఆసనాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత వెంకట్ తెలిపారు. కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు ధర్మవీర్ యోగా శిక్షణ గురువు అయిలేని అనిత హాజరై ప్రాణాయామం, ఆసనాలు, మెడిటేషన్ తదితర యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్, రన్నర్స్, స్విమ్మర్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు, యువతీ యువకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు అక్కన్నపేటలో మంత్రి పర్యటన

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని మల్లంపల్లి, మోత్కులపల్లి గ్రామాల్లో శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించనున్నారని పార్టీ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య గురువారం పేర్కొన్నారు. ఉదయం 7.30 గంటలకు మల్లంపల్లి, 8.30 గంటలకు మోత్కులపల్లి గ్రామాలలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజల వద్దకు పాలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లా అధికారులతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని పేర్కొన్నారు.

పరిశోధనా పత్రాలు ప్రచురితమవ్వడం గర్వకారణం

సిద్దిపేటఎడ్యుకేషన్ : అధ్యాపకుల పరిశోధనా పత్రాలు యూజీసీకేర్‌లో ప్రచురితమవ్వడం కళాశాలకు గర్వకారణమని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ అన్నారు. గురువారం కళాశాలలో పుస్తక సంకలనంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మార్చి నెలలో డిగ్రీ కళాశాలలో బోటనీ విభాగాధిపతి డాక్టర్ కొమ్మిడి రాణి ఆధ్వర్యంలో జీవవైవిధ్యం–సంరక్షణపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తే అందులో 22 పరిశోధనా పత్రాలు యూజీసీకేర్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయన్నారు. ఇప్పుడు రెండు వాల్యూమ్‌లుగా ప్రచురించామన్నారు. అనంతరం రాణి మాట్లాడుతూ రెండు వాల్యూమ్‌లలో పుస్తకం రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇందుకు సహకరించిన అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాసం శ్రీనివాస్, కళాశాల సీఓఈ డాక్టర్ గోపాల సుదర్శనం ప్రసంగించారు. కార్యక్రమంలో పీజీ కోఆర్డినేటర్ డాక్టర్ అయోధ్యరెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, ఆయా విభాగాల అధిపతులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మల్లేశం, డాక్టర్ సుజాత, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మదన్‌మోహన్, మహేష్, శైలజ, శ్రీనివాస్, స్రవంతి పాల్గొన్నారు.

పీజీ విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలి


సిద్దిపేటఎడ్యుకేషన్: పీజీ విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ సిద్దిపేట ప్రాంతీయ అభ్యాసకుల సహాయ కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్ గురువారం తెలిపారు. ఆయా సబ్జెక్టులకు సంబంధించి పీజీ ప్రథమ, ద్వితీయ, బ్యాక్‌లాగ్ విద్యార్థులు జూలై 7లోగా ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. రూ. 500ల ఫైన్‌తో 14వ తేదీ వరకు, రూ. 1000 ఫైన్‌తో జూలై 24 వరకు చెల్లించే అవకాశం ఉందని తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జూలై 31 నుంచి ఆగస్టు 4 వరకు, ఫస్టియర్ విద్యార్థులకు ఆగస్టు 9 నుంచి 13 వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

ఫలించిన ప్రియురాలి పోరాటం

దుబ్బాకరూరల్: ఎట్టకేలకు ప్రియురాలి పోరాటం ఫలించింది. ప్రియుడు వివాహానికి అంగీకరించడంతో ఆమె కథ సుఖాంతమైంది. సీఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. అక్బర్‌పేట–భూంపల్లి మండలం రామేశ్వరంపల్లికి చెందిన ఒక యువతి మూడు రోజుల నుంచి ప్రియుడి ఇంటి ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా చేస్తుంది. అతను వివాహం చేసుకుంటానని మోసం చేశాడని పేర్కొంది. ఈ విషయం తెలుసుకున్న ఏసీపీ మధు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీఐ శ్రీనివాస్‌కు కేసు బాధ్యతలు అప్పజెప్పగా.. ప్రియురాలిని ప్రియుడు శ్రీకాంత్ వివాహం చేసుకుంటానని తెలిపాడన్నారు.

గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

సిద్దిపేటఅర్బన్: ఒక పాన్‌షాప్‌పై త్రీటౌన్ పోలీసులు గురువారం రాత్రి దాడి చేసి నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగధాంపల్లికి చెందిన పోతారం స్వామి స్థానిక చౌరస్తా వద్ద పాన్‌షాప్ నడుపుతున్నాడు. నిషేధించిన గుట్కాలు, అంబర్, బ్లూబుల్ అమ్ముతున్నాడని పోలీసులకు సమాచారం అందింది. దీంతో సీఐ, సిబ్బందితో కలిసి పాన్‌షాప్‌పై దాడులు చేసి రూ. 4,290 విలువైన గుట్కాలు, టొబాకో ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. యజమానిపై కేసు నమోదు చేశారు.



వానమ్మా.. ఒక్కసారి వచ్చిపోవమ్మా

- వాడిపోతున్న పంటలు
- ఆకాశం వైపు రైతన్న చూపు

మర్కూక్(గజ్వేల్): రోజూ మబ్బులు మురిపిస్తున్నాయి కానీ వాన కురియడం లేదు. ఇప్పుడు మొలక దశలో పైర్లు ఉండగా బతుకుతాయో లేవోనని రైతులు దిగులు చెందుతున్నారు. సంవృద్ధిగా వర్షాలు కురుస్తాయనే ఆశ క్రమంగా ఆవిరవుతుంది. విషయానికొస్తే.. గతేడాది కొండపోచమ్మ సాగర్ నుంచి కాల్వల ద్వారా రైతులు నీరు పారించుకున్నారు. ప్రస్తుతం కాల్వల ద్వారా నీరు రాకపోవడంతో వానపైనే ఆధారపడ్డారు. జూన్‌లో రుతుపవనాల ప్రభావంతో కురిసిన వర్షాలకు వరి, పత్తి, మొక్కజొన్న, కంది పంటలు వేశారు. వరుణుడు ముఖం చాటేయడంతో మొలకెత్తి పెరిగిన పంటలను కాపాడు దేవుడా అని వేడుకుంటున్నారు. వానాకాలం మొదలై నెల గడుస్తున్నా గజ్వేల్ నియోజక వర్గంలో మోస్తరే తప్ప భారీ వర్షం కురియలేదు. గతేడాది కంటే ఈయేడు వరి, పత్తి, మొక్కజొన్న పంటలను ఎక్కువ మొత్తంలో సాగు చేశారు. గజ్వేల్, మర్కూక్, జగదేవ్‌పూర్, వర్గల్, ములుగు, కొండపాక మండలల్లో అంచనా ప్రకారం 1,46,202 ఎకరాల్లో అన్ని రకాల పంటలు సాగు చేసేందుకు అంచనా వేసి నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. 96,202 ఎకరాల్లో పంట పత్తి సాగు చేస్తారని అంచనా వేయగా అందులో 50 వేల ఎకరాల్లో సాగు చేశారు. వరి 39,970 ఎకరాలకు 30,370 ఎకరాలలో నారుమడులను సిద్ధం చేశారు. కంది 5,340 ఎకరాలకు 100 ఎకరాలలో, మొక్కజొన్న 4,690 ఎకరాలకు 800 ఎకరాలలో విత్తనాలు నాటారు. ఇప్పటి వరకు 60 శాతం మాత్రమే రైతులు పంటలను సాగు చేశారు.



వర్షం లేక వాడిపోయిన పత్తి చేను

ఏఓల సలహాలు, సూచనలు తీసుకోవాలి



మే నెలలోనే సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. వర్షాలు సంవృద్ధిగా కురవకపోవడంతో రైతులు చాలా వరకు పంటలు సాగు చేయలేదు. దుక్కులు దున్ని రైతులు సిద్ధమయ్యారు. ప్రతి మండల వ్యవసాయ కేంద్రంలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఇప్పుడు రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనల మేరకు పంటలు సాగు చేయాలి. జూన్ లో సంవృద్ధిగా వర్షాలు కురిస్తే 90 శాతం రైతులు పంటలను సాగు చేసుకునే వారు. గతేడాది కంటే ఈ ఏడాది అధికంగా పంటలు సాగు చేసేందుకు సన్నద్ధమయ్యారు. – అనిల్ కుమార్, ఏడీఏ

3.5 లక్షల మంది ఎదురుచూపులు

- గృహజ్యోతి కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో వినియోగదారులు 11.45 లక్షల మంది
- లబ్ధిదారులు 4.71 లక్షల మంది


సాక్షి, సిద్దిపేట: ప్రభుత్వం ఆరు గ్యారంటీలలో ఒకటైన గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తుంది. రేషన్ కార్డు కలిగి ఉండి 200 యూనిట్ల లోపు వినియోగిస్తే ఉచిత విద్యుత్‌ను అందిస్తోంది. కానీ ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటరీకరణలో లోపాలతో జిల్లావ్యాప్తంగా అర్హత కలిగిన విద్యుత్ వినియోగదారులకు సగం మందికి పైగా పథకం అందడం లేదు. దీంతో గ్రామాల్లో మండల పరిషత్ కార్యాలయాలకు, పట్టణాల్లో మున్సిపాలిటీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

కార్యాలయాల చుట్టూ ప్రజలు

కొందరు 200 యూనిట్‌ల లోపు విద్యుత్ వినియోగిస్తున్నప్పటికీ గృహజ్యోతి పథకం లబ్ధిని పొందలేకపోతున్నారు. ప్రజాపాలన దరఖాస్తు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే సమయంలో రేషన్ కార్డు లేదని నమోదు చేస్తున్నారు. ఇంకా విద్యుత్ సర్వీస్ నంబర్ తప్పుగా పడితే ఎడిట్ ఆప్షన్ ఇచ్చారే తప్ప.. రేషన్ కార్డు నంబర్‌లను ఎంటర్ చేయడం లాంటి వాటికి ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 8,29,448 రేషన్ కార్డులుండగా సిద్దిపేట జిల్లాలో 2,91,400, సంగారెడ్డిలో 3,24,188, మెదక్‌లో 2,13,860 ఉన్నాయి. సుమారుగా 3.5 లక్షల మంది అర్హత కలిగిన వారు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

రేషన్ కార్డులు లేకపోవడంతో దూరం

రేషన్ కార్డులు ఉన్న వారే గృహజ్యోతికి అర్హులని ప్రకటించారు. లేనివారు పథకానికి దూరమవుతున్నారు. కొన్ని సంవత్సరాల నుంచి కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోయింది. కొత్తగా వివాహమైన వారు వేరు కాపురాలు పెట్టారు. దీంతో రేషన్ కార్డులు లేకపోవడంతో అనర్హులవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆన్‌లైన్‌లో రేషన్‌కార్డు నంబర్‌లు ఎంటర్ చేసి, అలాగే కొత్తగా రేషన్ కార్డులను జారీ చేసి అర్హులందరినీ పథకానికి ఎంపిక చేయాలని విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు.



ఉమ్మడి మెదక్‌లో గృహజ్యోతికి 4.71 లక్షల సర్వీస్‌లు

ఉమ్మడి మెదక్ జిల్లాలో గృహజ్యోతికి జూన్ నెలలో 4,71,456 సర్వీస్‌లు ఎంపికై ఉచిత విద్యుత్‌ను పొందుతున్నాయి. వీటికి రూ.15.92కోట్ల రాయితీని వినియోగదారులు పొందారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో కేటగిరి–1 సర్వీస్‌లు 11,45,706లు ఉన్నాయి. మొత్తంగా 41.14 శాతం మందికి మాత్రమే జీరో బిల్లులు జారీ అయ్యాయి. రేషన్ కార్డు ప్రామాణికంగా తీసుకొని అర్హత కలిగిన వారనే కోణంలో ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. విద్యుత్ అధికారులు ఇంటింటికీ తిరిగి వేరిఫికేషన్ చేసుకున్నారు.

జిల్లా పేరు	కేటగిరి–1 సర్వీస్‌లు	గృహజ్యోతి లబ్ధిదారులు	నగదు (రూ.కోట్లలో)
సిద్దిపేట	3,47,260	1,81,365	6.10
సంగారెడ్డి	5,93,030	1,76,064	6.63
మెదక్	2,05,416	1,14,027	3.19

మూడు నెలలుగా తిరుగుతున్నా..



గృహజ్యోతి జీరో కరెంట్ బిల్లు రావడం లేదు. దీంతో మూడు నెలలుగా ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మొన్న నెల రూ.600 కరెంట్ బిల్లు వచ్చింది. ప్రజాపాలనలో దరఖాస్తుతో పాటు రేషన్, ఆధార్ కార్డులు సైతం ఇచ్చాను. ఇప్పటికైన పథకానికి ఎంపిక చేయాలి. – యాదమ్మ, ఐనాపూర్

జీరో బిల్లు వర్తింప చేయాలి



ప్రజాపాలన దరఖాస్తు చేశాను. ఇంటి సర్వేకు అధికారులు వచ్చారు. కానీ కరెంట్ జీరో బిల్లు రావడం లేదు. ఇదేమిటని అడిగితే? ఎంపీడీఓ కార్యాలయం ఎంటర్ చేయించుకోవాలన్నారు. దీంతో ఆఫీస్‌లో చెక్ చేసి ఆప్షన్ రాలేదని చెబుతున్నారు. అధికారులు జీరో బిల్లుకు ఎంపిక చేయాలి. – రాములు, బెజ్జంకి



మాట్లాడుతున్న ఎస్‌ఈలు మోహన్‌రెడ్డి, జానకీరామ్ తదితరులు

త్వరలో 'ఫీడర్ సర్వే యాప్' సేవలు

- పనితీరును పరిశీలించనున్న విద్యుత్ శాఖ
- ప్రత్యేక శిక్షణకు హాజరైన ఇంజినీర్‌లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జియోగ్రాఫికల్ సమాచార వ్యవస్థపై టీజీఎస్‌పీడీసీఎల్ ఐటీ విభాగం ఆధ్వర్యంలో సిద్దిపేట, మెదక్ జిల్లాల విద్యుత్ శాఖ ఇంజినీర్‌లకు ప్రత్యేక శిక్షణ అందించారు. గురువారం జిల్లా విద్యుత్‌భవన్‌లో ఫీడర్ సర్వే యాప్‌పై ప్రత్యేక శిక్షణ అందించారు. ఈ సందర్భంగా సిద్దిపేట విద్యుత్ శాఖ ఎస్‌ఈ మోహన్‌రెడ్డి, మెదక్ ఎస్‌ఈ జానకీరామ్‌లు మాట్లాడుతూ, విద్యుత్ సరఫరా అంతరాయాలకు అనేక కారణాలు ఉంటాయన్నారు. ప్రత్యేకంగా ఈ యాప్ ద్వారా వాటిని గుర్తించే అవకాశం ఉందన్నారు. 11 కేవీ ఫీడర్ పై ఎన్ని స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, కండక్టర్ సైజు, స్తంభం స్తంభానికి మధ్య దూరం, విద్యుత్ సరఫరా లైన్ల కింద, లైన్లను తాకు చెట్ల వివరాలు సేకరించనున్నట్లు తెలిపారు. ఒక్కో ఫీడర్‌పై ఎన్ని ట్రాన్స్‌ఫార్మర్‌లున్నాయి, వాటి సామర్థ్యం ఎంత అనేది యాప్ ద్వారా తెలియనుందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌పై ఎన్ని కనెక్షన్‌లున్నాయి, లోడ్ వివరాలు కూడా సేకరించనున్నామన్నారు. ఈ యాప్ ద్వారా సర్వే చేసిన వివరాల ప్రకారం మెటీరియల్, సిబ్బందిని సమకూర్చుకుని లోపాలను సరిదిద్దుకోవచ్చన్నారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ సరఫరా నిలిచినప్పుడు, ఫీల్డ్‌లో లోపాలను సరి చేస్తున్నారా లేదా అని కంప్యూటర్ ద్వారా పరిశీలించుకోవచ్చన్నారు. మరమ్మతుల ఖర్చు, అంతరాయంలో సమయం తగ్గుతుందన్నారు. ఈ యాప్‌ను సిద్దిపేట జిల్లా కేంద్రంలో వినియోగించి పనితీరును పరిశీలించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిద్దిపేట డివిజన్ ఇంజినీర్‌లు మహేశ్ కుమార్, శ్రీనాథ్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ గంగాధర్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు

గజ్వేల్ డివిజన్ ఏడీఏ బాబూనాయక్



వెలికట్టలోని విత్తన షాపు బిల్లులను పరిశీలిస్తున్న ఏడీఏ బాబూనాయక్

కొండపాక(గజ్వేల్): నకిలీ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని గజ్వేల్ డివిజన్ వ్యవసాయాధికారి బాబూనాయక్ హెచ్చరించారు. మండలంలోని వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద నున్న ఫెస్టిసైడ్స్, ఫర్టిలైజర్ విక్రయ దుకాణాన్ని విజిలెన్స్ అధికారులతో కలిసి ఆయన గురువారం తనిఖీ చేశారు. దుకాణంలో ఉన్న వివిధ కంపెనీల తెగుళ్ల నివారణ మందులు, విత్తనాలు అమ్మేందుకు అవసరమైన అనుమతి పత్రాలను పరిశీలించారు. క్రయవిక్రయాల రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్‌ల నమోదు ప్రక్రియలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాబూనాయక్ మాట్లాడుతూ నకిలీ ఎరువులు, మందులను విక్రయించరాదన్నారు. కొందరు గ్రామాల్లో బ్రోకర్లు లూజు పత్తి విత్తనాలను తీసుకువచ్చి రైతులకు అంటగడుతుంటారని, అలాంటివి గుర్తిస్తే విజిలెన్స్, వ్యవసాయాధికారులకు సమాచారం అందజేయాలన్నారు. అనుమతులున్న మందులను మాత్రమే విక్రయించాలన్నారు. రోజువారీగా అమ్మకం, స్టాక్ వివరాలను నోటీస్ బోర్డులో పెట్టాలన్నారు. నకిలీ విత్తనాలు ఎవరైనా విక్రయిస్తున్నట్లు సమాచారం అందిస్తే సదరు వ్యాపారులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఓ ప్రియదర్శిని, విజిలెన్స్ బృందం సభ్యులు, దుకాణాదారులు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి తక్కువ లాభం ఎక్కువ

- ఆయిల్‌పామ్ సాగును రైతులు చేపట్టాలి
- జిల్లా ఉద్యాన అధికారి సువర్ణ



ట్రైనీ అధికారులతో జిల్లా ఉద్యాన అధికారి సువర్ణ, మండల వ్యవసాయ అధికారులు

మర్కూక్(గజ్వేల్): ఆయిల్‌పామ్ సాగుకు పెట్టుబడి తక్కువ లాభాలు ఎక్కువని జిల్లా ఉద్యాన అధికారి సువర్ణ తెలిపారు. గురువారం మండల కేంద్రమైన మర్కూక్‌లో రైతు జీవన్‌రెడ్డి సాగు చేస్తున్న ఆయిల్ పామ్ పొలం వద్ద తెలంగాణ ప్రభుత్వ ట్రైనీ ఉద్యాన అధికారులకు నర్సరీ, డ్రిప్ నిర్వహణపై ఆమె అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ, రైతులు ఆరుగాలం శ్రమించి ఆరు తడి పంటలు వేసి ఆరు నెలలైనా వేచి చూడాల్సి ఉందన్నారు. కానీ కొన్నిసార్లు పంట చేతికందే సమయంలో అకాల వర్షాలు కురిసి రైతులు నష్టపోతున్నారన్నారు.

సమయానికి ఆహారంతో ఆరోగ్యం

- కలెక్టర్ మనుచౌదరి
- మోడల్ స్కూల్‌లో అల్బెండజోల్ మాత్రల పంపిణీ



కొండపాక: విద్యార్థినికి అల్బెండజోల్ మాత్రలను వేస్తున్న కలెక్టర్ మనుచౌదరి

కొండపాక(గజ్వేల్): సమయానికి సరైన ఆహారం తీసుకుంటే ఆరోగ్యవంతంగా ఉంటారని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా గురువారం కొండపాకలోని మోడల్ స్కూల్ విద్యార్థులు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రతలతో పాటు పోషకాహారాన్ని తీసుకుంటే నులి పురుగుల నుంచి గట్టెక్కవచ్చన్నారు. 1 నుంచి 19 సంవత్సరాల వయసు గల వారందరూ మాత్రలను వేసుకోవాలన్నారు. కడుపులో నులి పురుగుల ఉత్పత్తి నశించిపోతాయన్నారు. ఈ తరహా వ్యాధిగ్రస్తుల్లో సరైన శారీరక ఎదుగుదల, రక్తహీనత లోపాలు ఏర్పడి నీరసంగా ఉంటారన్నారు. జిల్లా వ్యాప్తంగా 2,38,559 మందికి ఈ మాత్రల అవసరం ఉందని గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు విజయరాణి, వినోద, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కాశీనాథ్, వైద్యులు శ్రీనివాస్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వన్నీసా, ఏఓ రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఆరోగ్య కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల కృషి అభినందనీయం

సిద్దిపేటరూరల్: జిల్లాలో ఎన్నికల ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించడంలో ఉద్యోగుల పాత్ర ఎంతో ఉందని కలెక్టర్ మనుచౌదరిని అన్నారు. గురువారం టీఎన్‌జీఓ సంఘం ఆధ్వర్యంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో లోక్‌సభ ఎలక్షన్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉద్యోగులు సమర్థవంతంగా పనిచేశారని అభినందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కోమండ్ల విక్రమ్ రెడ్డి, సత్యనారాయణ, నగేశ్, సుమన్, సుజాత, మంజుల రత్నమ్మ, అనురాధ తదితర ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

ప్రజలు భాగస్వామ్యం కావాలి

గజ్వేల్‌రూరల్: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ లోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలను వేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, జెడ్పీటీసీ మల్లేశం, వైద్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజ్ఞాపూర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలను వేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గ్రేడ్–2 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో జిల్లాలో జరగనున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ఆయా శాఖల అధికారులతో కలిసి ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈనెల 24 నుంచి 29 వరకు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ పరీక్ష, జూన్ 30 నుంచి జూలై 4 వరకు గ్రేడ్–2 డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్స్ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. రెండు సెషన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్‌కు 3,296 మంది, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్స్‌కు 1250 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. టీజీపీఎస్‌సీ మార్గదర్శకాల మేరకు ఒక రోజు ముందు మాక్ టెస్ట్ నిర్వహించాలన్నారు. సెంటర్లలో సీసీ కెమెరాల ఏర్పాటు, సరిపడా ఫర్నిచర్, తాగునీరు తదితర సదుపాయాలు కల్పించాలన్నారు. ఎక్కడా విద్యుత్ అంతరాయం లేకుండా ఆశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు.. అభ్యర్థులను తనిఖీ చేశాకే సెంటర్లలోకి అనుమతించాలన్నారు.

మహనీయుల సేవలు మరువలేనివి

జ్యోతిరావుపూలే, సావిత్రీబాయి విగ్రహాల ఆవిష్కరణలో మంత్రి సీతక్క



పూలే, సావిత్రీబాయి విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

మద్దూరు(హుస్నాబాద్): మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలేలు మహిళా విద్య కోసం తీవ్రంగా కృషి చేశారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. వారి త్యాగ ఫలాలనే తాము అందరం అనుభవిస్తున్నామన్నారు. అందువల్ల ఇవాళ అన్ని రంగాల్లో మహిళలు ముందుకు దూసుకుపోతున్నారన్నారు. అందుకు తానే నిదర్శనన్నారు. గురువారం చేర్యాల మండలం కమలాయిపల్లిలో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే అభివృద్ధిని ఆకాంక్షించామని, కానీ పూర్తిగా దోపిడీకి గురయ్యిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. తమ నియోజకవర్గ అభివృద్ధి కోసం చేర్యాలపై పూర్తిగా వివక్ష చూపించారన్నారు. సాగు నీటి విషయంలో ఆ ప్రాంతం తీవ్ర అన్యాయానికి గురైందన్నారు. ఈ విషయమై నీటి పారుదల శాఖ మంత్రితో మాట్లాడుతానన్నారు. నూతన జిల్లాల ఏర్పాటుతో అన్ని రంగాల్లో చేర్యాల నష్టపోతుందన్నారు. అనంతరం స్థానికులు గ్రామంలో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకుపోగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీసీసీ జనగామ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నాగపూరి రాజలింగం, జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, ఎంపీటీసీ కళ్యాణి కమలాకర్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేక మల్లేశం, కొమ్ము రవి, కోల సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పార్టీ కార్యకర్తల కోసమే..

ఎంపీ రఘునందన్‌రావు


మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

మెదక్‌జోన్: కార్యకర్తల కష్టం వల్లే తాను ఎంపీగా గెలిచానని, వారికి ఎప్పుడు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని, వారి కోసమే చాలా రోజుల తర్వాత నల్లకోటు ధరించి కోర్టుకు వచ్చినట్లు ఎంపీ రఘునందర్ రావు అన్నారు. మెదక్‌లో ఇరు వర్గాల ఘర్షణల నేపథ్యంలో అరెస్టై జైలులో ఉన్న బీజేపీ నాయకులు, కార్యకర్తల బెయిల్ పిటిషన్‌పై వాదించేందుకు రఘునందన్ రావు గురువారం న్యాయవాదిగా మెదక్ కోర్టుకు వచ్చారు. కోర్టులో వాదనల అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 15వ తేదీన శనివారం గో సంరక్షకులు వెళ్లి ఫిర్యాదు ఇచ్చినపుడు పోలీసులు నిర్ణీత సమయంలో స్పందించి ఉంటే పరిస్థితి చేయిదాటి పోయేది కాదన్నారు. ఇక్కడ ఎవరూ ఉద్దేశ్య పూర్వకంగా హింసకు పాల్పడలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత జడ్జి పిటిషన్‌ను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసినట్టు తెలిపారు.

డయాగ్నోస్టిక్ కేంద్రంలో టెస్టులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో ఉన్న డయాగ్నోస్టిక్ సెంటర్‌లో మెషీన్ మొరాయించడంతో పరీక్షలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో రోగులకు 'పరీక్షే' అనే శీర్షికతో 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారులు స్పందించారు. టెక్నీషియన్‌ను పిలిపించి మొరాయించిన మెషీన్‌లను రిపేర్ చేయించారు. దీంతో డయాగ్నోస్టిక్ కేంద్రంలో టెస్టులు తిరిగి గురువారం ప్రారంభమయ్యాయి. అదే విధంగా కిట్‌లు అందుబాటులో లేకపోవడంతో థైరాయిడ్ పరీక్షలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. థైరాయిడ్ పరీక్షలకు ఉపయోగించే కిట్‌లు కూడా అందుబాటులోకి రావడంతో పరీక్షలు తిరిగి ప్రారంభించారు. వివిధ రక్త పరీక్షల నిమిత్తం రోగులు ఎవరూ కూడా ప్రైవేటు సెంటర్లకు వెళ్లొద్దని, ప్రభుత్వ ఆస్పత్రిలోని డయాగ్నోస్టిక్ సెంటర్‌లో అన్ని రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్ తెలిపారు.

గొంతులో గులక రాయి ఇరుక్కుని చిన్నారి మృతి


అలీషా (ఫైల్)

చేర్యాల(సిద్దిపేట): గొంతులో గులక రాయి ఇరుక్కుని చిన్నారి మృతిచెందింది. ఈ ఘటన మండల పరిధిలోని కడవేర్గులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన షబీర్ పాషా కూతురు అలీషా (2) గురువారం ఉదయం అమ్మమ్మ ఊరైన కొమురవెల్లి మండలం రాంసాగర్‌లో ఆడుకుంటూ గులక రాయి మింగింది. అది గొంతులో ఇరుక్కోవడంతో ఊపిరి ఆడకపోవడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చేర్యాల ఆసుపత్రికి తీసుకు రాగా పరీక్షించిన వైద్యులు జిల్లా ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. హుటాహుటిన జిల్లా కేంద్రంలోని హాస్పిటల్‌కు తీసుకెళ్లేలోపు పాప మృతిచెందినట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

కోహెడరూరల్(హుస్నాబాద్): కోహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బొల్లం రూపా(24) వివాహిత క్షణికావేశంలో బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. భార్యాభర్తల మధ్య గొడవలే మహిళ ఆత్మహత్యకు కారణమని తెలిసింది.

ఉపయోగాలెన్నో..



- యోగాపై ప్రజల్లో పెరుగుతున్న అవగాహన
- ఆరోగ్య సమస్యలకు అద్భుత పరిష్కారం
- ఒత్తిడి, డిప్రెషన్ దూరం
- నిత్య సాధన చేస్తే మేలంటున్న నిపుణులు
- సిద్దిపేటలో విరివిగా శిక్షణ కార్యక్రమాలు

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

ఒత్తిడిని అధిగమించడానికి, శారీరక ఆరోగ్యం కాపాడుకోవడానికి ప్రపంచం మొత్తం యోగా చుట్టే తిరుగుతోంది. ప్రతి రోజూ ఒక గంట యోగాకు కేటాయిస్తే మనకు యోగం కలుగుతుందని పెద్దలు చెబుతుంటారు. కావున ఎంతటి పని ఉన్నా నిత్యం యోగాకు ప్రత్యేక సమయం కేటాయించాలి. దీంతో శారీరక, మానసిక ఆందోళనలు తగ్గుతాయి. సంపూర్ణ ఆరోగ్యంతోపాటు నిత్య నూతనోత్సహం కలుగుతుంది. 2015 నుంచి ఏటా జూన్ 21వ తేదీన ప్రపంచ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నారు. శుక్రవారం యోగా డే సందర్భంగా ప్రత్యేక కథనం..

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)


సిద్దిపేట జిల్లా కేంద్రంలో యోగా చేస్తున్న విద్యార్థులు

సిద్దిపేట జిల్లా నేడు యోగాలో జాతీయ స్థాయిలో గుర్తింపును పొందింది. అనేక మంది జాతీయ, రాష్ట్ర యోగా పోటీలలో రాణించడంతో పాటుగా, అనేక మందికి యోగాను నేర్పుతున్నారు. ఆన్‌లైన్ ద్వారా అంతర్జాతీయంగా యోగాను నేర్పుతున్నారు. జిల్లాలోని వ్యాస మహర్షి యోగా సొసైటీ, సిద్దిపేట యోగా స్పోర్ట్స్ అసోసియేషన్, పతంజలి యోగా అసోసియేషన్, హార్ట్ ఫుల్‌నెస్ యోగా అండ్ మెడిటేషన్ సంస్థ, ఇతర సంస్థల ఆధ్వర్యంలో నిత్యం యోగా శిక్షణ అందిస్తున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ యోగా శిక్షకులు అనేక మందికి యోగాలో శిక్షణ అందిస్తున్నారు. ప్రజల్లో యోగాపై అవగాహన పెరగడంతో ప్రతి రోజూ ఆచరిస్తున్నారు. నేడు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 7 గంటలకు నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పాల్గొననున్నారు.

ఆన్‌లైన్‌లో యోగా శిక్షణ

సిద్దిపేటలో మొదటగా యోగా శిక్షణ అందిస్తూ నేడు అంతర్జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా యోగా శిక్షణ అందిస్తున్నారు సిద్దిపేట యోగా శిక్షకులు. తమ యూట్యూబ్ ఛానల్‌ల ద్వారా శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నారు. అమెరికా, ఐర్లాండ్, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా తదితర దేశాలకు చెందిన వారు ఆన్‌లైన్‌లో శిక్షణ పొందుతున్నారు.

ఉచిత యోగా శిబిరాలు..

జిల్లాలో సందర్భాన్ని బట్టి ఉచిత యోగా శిక్షకులు, ప్రత్యేక యోగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీనివాస ధ్యాన మందిరం, శ్రీ ఉమా పార్థీశ్వర కోటిలింగాల ఆలయం, బాలసదనం, అభయజ్యోతి, నర్సింగ్ కళాశాల, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ఎన్‌జీవోస్ కాలనీ, సిటిజన్ క్లబ్, కోమటి చెరువు, వ్యాస మహర్షి సొసైటీలో, పాఠశాలల్లో, తదితర చోట్ల ఉచితంగా యోగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. వృద్ధులకు అనుకూలంగా రిథమిక్, పవర్, స్టిక్, రూప్ యోగాలు జిల్లా కేంద్రంలో నేర్పిస్తున్నారు. యోగా అనేక రోగాలకు దివ్య ఔషధంగా పని చేస్తుంది. యోగా హెల్త్ డ్రైవ్ పేరిట ఆస్తమా, డయాబెటీస్, తదితర వ్యాధులకు ఆక్యుపంచర్, మడ్‌బాత్ (మట్టిస్నానం)లతో వివిధ సంస్థల ప్రతినిధులు యోగా చికిత్స కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు .

వయస్సుతో సంబంధం లేకుండా..

చిన్నారులకు, మహిళలకు, వృద్ధులకు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన యోగా శిక్షణ శిబిరంలో ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి 7గంటల వరకు, సాయంత్రం 7.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు యోగా శిక్షణ అందిస్తున్నారు. బాలసంస్కార్, మన సంస్కృతీ, యోగాతో ఆరోగ్యం తదితర కార్యక్రమాల పేరిట నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమంలో చిన్నారులు విరివిగా పాల్గొంటున్నారు.


యోగాసనాలు వేస్తున్న మహిళలు, యువకులు

50 వేల మందికి శిక్షణ అందించాం



ప్రతి రోజూ గంటపాటు యోగా చేసిన వారికి మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుంది. యోగా అనేది మన పూర్వికులు ప్రపంచానికి అందించిన గొప్ప సంపద. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాను క్రీడల జాబితాలో చేర్చినందున, క్రీడలకు ఇచ్చిన విధంగానే సముచిత స్థానం లభిస్తుంది. యోగాలో జాతీయ, రాష్ట్ర స్థాయి బహుమతులు పొందాం . ఇప్పటి వరకు దాదాపుగా 50 వేల మందికి యోగా శిక్షణ అందించాం. 500 మందిని యోగా శిక్షకులుగా తీర్చిదిద్దాం.

– తోట సంధ్య–సతీష్, యోగా శిక్షకులు, సిద్దిపేట

వయో, లింగ భేదాలు లేవు



యోగా చేయడం అనేది, వయస్సును బట్టి, లింగత్వాన్ని బట్టి ఉండదు. అన్ని వయస్సుల వారు చేయొచ్చు. ముఖ్యంగా బాలికలు, యువతులు, మహిళలకు ఈ యోగా ద్వారా శారీరక సమస్యలు నయం అవుతాయి. నిత్యం యోగా చేయడం ద్వారా డయాబెటీస్, అధిక బరువు, నడుం నొప్పులు తదితర వాటికి యోగా చక్కటి పరిష్కారం లభిస్తుంది. ప్రతి రోజులో తమకు ఉన్న సమయాన్ని బట్టి యోగా చేయడంతోపాటుగా, తమ వారికి అవగాహన కల్పించాలి.

–గంగాపురం శ్రీనివాస్, యోగా శిక్షకుడు, సిద్దిపేట

అనారోగ్య సమస్యలు రావు



ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యంతోపాటు డబ్బులను ఆదా చేసుకోవచ్చు. అనారోగ్యం పాలైతే మనం సంపాదించిన డబ్బులు ఖర్చు అవుతాయి. ప్రతి రోజూ యోగా చేస్తే అనారోగ్యాలు దరిచేరవు. యోగాను ప్రతి ఒక్కరూ చేయొచ్చు. సిద్దిపేట జిల్లాలో అనేక మంది యోగాను అభ్యసిస్తున్నారు. అదే విధంగా యోగాను ఇతరులకు నేర్పుతున్నారు.

–శివ్వ శ్రీనివాస్, యోగా శిక్షకుడు, సిద్దిపేట



టేక్మాల్ మోడల్ స్కూల్‌లో యోగాడే ఆకారంలో విద్యార్థులు

ఆసనం.. ఆరోగ్యం

టేక్మాల్(మెదక్): పొద్దున లేవగానే యోగాసనాలు వేస్తే రోజంతా ప్రశాంతంగా ఉండటంతో పాటు ఆరోగ్యానికి దోహదం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. పిల్లలు, యువకులు, పురుషులు, వృద్ధులు నిత్యం యోగా చేసేందుకు ముందుకు వస్తున్నారు.

సర్వరోగ నివారిణి



ప్రస్తుతం ఆధునిక జీవన శైలీ, ఒత్తిడి కారణంగా ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారు. నిత్యం యోగా సాధన చేయడంతో వీటి నుంచి ఉపశమనం పొందవచ్చు. మనస్సు, వాక్కు, కర్మలను నియంత్రించుకోవడంతో పాటు శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతతను పొందేందుకు యోగా దోహదపడుతుంది.

– నిమ్మ వాణి, ఎంపీటీసీల ఫోరం జిల్లా ఉపాధ్యక్షురాలు

ఒత్తిడి దూరం..



ప్రతి రోజూ యోగా చేయడంతో ఆరోగ్యంగా ఉంటాం. నిత్యం బిజీగా ఉండే వారు ఒత్తిడిని జయించి ఉత్సాహంగా పనులు చేసుకోగలుగుతారు. రోజు అరగంటపాటు యోగాకు సమయం కేటాయిస్తే చిన్న చిన్న వ్యాధులకు ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరం ఉండదు.

– డాక్టర్ కృతిక, వైద్యాధికారిణి, టేక్మాల్

యోగాతోనే ఆరోగ్యం..



యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. యోగా చేయడంతో ఎలాంటి శస్త్ర చికిత్స లేకుండానే ఆరోగ్యం బాగుపడుతుంది. ప్రతి రోజూ చేయడంతో పాటు పలువురికి యోగాను నేర్పిస్తున్నాను. మా పాఠశాలలో ప్రత్యేకంగా యోగా తరగతులను నిర్వహించడంతో విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణిస్తున్నారు.

– నర్సింలు, యోగా మాస్టర్, మోడల్ స్కూల్, టేక్మాల్

పంట రుణం కింద జమ చేసుకోవద్దు

- రైతుల ఖాతాలను హోల్డ్‌లో పెట్టొద్దు
- జిల్లా వ్యవసాయ అధికారిణి అంబికా సోని
- బ్యాంకు మేనేజర్‌కు సర్క్యులర్ కాపీ అందజేత


కాపీని అందజేస్తున్న వ్యవసాయాధికారులు

సాక్షి ఎఫెక్ట్..

వట్‌పల్లి(అందోల్): పంట పెట్టుబడి సాయంగా ప్రభుత్వం అందించే రైతుబంధు డబ్బులను ఎట్టి పరిస్థితుల్లో పంట రుణానికి ముడిపెట్టి రుణం కింద జమ చేసుకోవద్దని జిల్లా వ్యవసాయాధికారిణి అంబికాసోని అన్నారు. పంట రుణాలు చెల్లించలేదని వట్‌పల్లి ఏపీజీవీబీ బ్యాంకు అధికారులు రైతు బంధు డబ్బులను రుణం కింద జమచేసుకోవడంతో పాటు బ్యాంకు ఖాతాలను హోల్డ్‌లో పెట్టడంపై గురువారం సాక్షి దినపత్రికలో వచ్చిన 'రుణాలు కట్టాల్సిందే..' అనే కథనానికి జిల్లా వ్యవసాయాధికారులు స్పందించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండల వ్యవసాయాధికారులు సదరు రైతులతోపాటు బ్యాంకు మేనేజర్ జనార్దన్‌తో మాట్లాడి వివరాలను సేకరించారు రైతు బంధు నగదును రుణం పేరిట జమ చేసుకోవద్దని జారీ చేసిన సర్క్యులర్ కాపీని ఏఓ మహేష్‌చౌహాన్, ఏఈఓ మౌనిక బ్యాంకు మేనేజర్‌కు అందజేశారు. పంట రుణాల విషయంలో రైతులను ఇబ్బంది పెట్టొదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన విధంగానే ఆగస్టు 15 లోపు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని అప్పటి వరకు ఓపిక పట్టాలని బ్యాంకు మేనేజర్‌ను కోరారు.

మామిడ్గిలో ఇద్దరికి డెంగీ

గ్రామంలో పర్యటించిన వైద్య సిబ్బంది


వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మామిడ్గి గ్రామంలో డెంగీ వ్యాధి సోకి పలువురు ఆస్పత్రి పాలయ్యారు. జ్వరం రావడంతో గ్రామానికి చెందిన శైలేందర్‌రెడ్డి, బిందురెడ్డి చికిత్స నిమిత్తం గురువారం సమీపంలో బీదర్ ఆస్పత్రికి వెళ్లగా వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఇరువురికి డెంగీ వ్యాధి సోకినట్లు నిర్ధారించారు. ప్రస్తుతం ఇద్దరూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మిర్జాపూర్(బి) వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు మధ్యాహ్నం గ్రామంలో ఇంటింటికీ తిరిగి జ్వరం సోకిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. జ్వరం వస్తే వెంటనే ఆస్పత్రికి వెళ్లి చూయించుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా రెండు రోజుల కిందట మరి కొందరు డెంగీ వ్యాధి బారిన పడి కోలుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

గ్రామంలో లోపించిన పారిశుద్ధ్యం

పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మురికి కాల్వ ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతోపాటు ఎక్కడి చెత్త అక్కడే పడి ఉందన్నారు. కొన్ని రోజులుగా చెత్త సేకరణ సరిగ్గా జరగడం లేదన్నారు. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

విసిగిపోయారు.. తాళాలు పగులగొట్టారు

- డబుల్ బెడ్రూం ఇళ్లు ఆక్రమించిన 40 కుటుంబాలు
- బలవంతంగా ఖాళీ చేయించిన పోలీసులు
- రోడ్డుపై బైఠాయించి మహిళల నిరసన


సీఐతో వాగ్వాదం చేస్తున్న మహిళలు

రామాయంపేట(మెదక్): నివాస సదుపాయం లేని నిరుపేదలు గురువారం రామాయంపేటలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీలో ఖాళీగా ఉన్న ఇళ్ల తాళాలు పగులగొట్టి కుటుంబాలతో సహా ఇళ్లలోకి వెళ్లారు. బుధవారం అర్ధరాత్రి నుంచి ఒక్కొక్కరుగా కాలనీకి వచ్చి ఇళ్ల తాళాలు ధ్వంసం చేసి వాటిలో ప్రవేశించారు. ఉదయం కల్లా సుమారు 40 కుటుంబాలు ఇళ్లను ఆక్రమించుకొని హంగామా చేశాయి. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ రజనీకుమారి, సీఐ వెంకట్ రాజాగౌడ్, ఎస్‌ఐ రంజిత్ తమ సిబ్బందితో కాలనీకి వెళ్లగా వారితో వాగ్వాదానికి దిగారు. తాము డబుల్ బెడ్‌రూమ్‌ల కోసం దరఖాస్తు చేసుకున్నా ఇవ్వకుండా ఆర్థికంగా ఉన్నవారికి ఇచ్చారని, ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మహిళలు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఇళ్లను కబ్జా చేసుకున్న వారు వెంటనే ఖాళీ చేసి వెళ్లకపోతే కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. పోలీసులు బలవంతంగా వారితో ఇళ్లు ఖాళీ చేయించి వారిని పంపించేశారు.

కాలేజీకి నడుచుకుంటూ వెళ్తుండగా..

- కారు ఢీకొని ఇంటర్ విద్యార్థి మృతి
- ములుగు రాజీవ్ రహదారిపై ఘటన


జశ్వంత్ (ఫైల్)

ములుగు(గజ్వేల్): కాలేజీకి నడుచుకుంటూ వెళ్తున్న ఇంటర్ విద్యార్థిని కారు రూపంలో మృత్యువు వెంటాడింది. మరి కొద్దిసేపట్లో కాలేజీ గేటు వైపు తిరిగే తరుణంలో కారు ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన గురువారం సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రంలో రాజీవ్ రహదారిపై చోటు చేసుకుంది. ములుగు ఎస్‌ఐ విజయకుమార్ కథనం మేరకు.. ములుగు మండల కేంద్రానికి చెందిన తన్నీరు ఎల్లం–కృష్ణవేణి దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. చిన్న కుమారుడు జశ్వంత్(16) ఇటీవలె గ్రామ శివారులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్టియర్‌లో చేరాడు. గురువారం ఉదయం ఇంటి నుంచి నడుచుకుంటూ కాలేజీకి బయల్దేరాడు. తహసీల్దార్ కార్యాలయం సమీపంలోకిరాగానే హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన జశ్వంత్‌ను ములుగు మండలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఎల్లం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రియుడితో కలిసి భర్త హత్య


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం కూచనపెల్లిలో సోమవారం గీకురు నర్సయ్య హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆయన మృతికి వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు తెలిపారు. సీఐ శ్రీనివాస్ కథనం మేరకు.. చిత్తుకాగితలు ఏరుకొని జీవించే నర్సయ్య(55) భార్య ఎల్లవ్వకు అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన ఎండీ.రంజాన్‌తో కొంత కాలంగా వివాహేతర సంబంధం కొనసాగుతోంది. పలుమార్లు మందలించినా ఆమెలో మార్పు రాలేదు. సోమవారం రాత్రి గొడవ జరగడంతో ఎలాగైనా భర్తను అడ్డు తొలగించుకోవాలని ప్రియుడు రంజాన్‌తో కలిసి గొడ్డలితో నరికి చంపించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఎల్లవ్వను అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. గురువారం నిందితులు ఇద్దరిని అరెస్టు చేశారు.

అంధ విద్యార్థిని ప్రతిభ

ఐఐఎంలో సీటు సాధించిన జహీరాబాద్ వాసి


శివానీ

జహీరాబాద్: రైతు కుటుంబంలో పుట్టి, అంధత్వాన్ని జయించి జాతీయ స్థాయిలో నిర్వహించే ఐఐఎం(ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్) పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చి సీటు దక్కించుకున్నారు ఓ అంధురాలు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని గడి మహెలాలకు చెందిన కొత్తకాపు విజయలక్ష్మి, గోపాల్‌రెడ్డి దంపతుల రెండో సంతానమైన శివానీ పుట్టుకతో అంధురాలు. అయినా చదువుపై ఉన్న ఆసక్తితో ప్రాథమిక విద్యాభ్యాసం హైదరాబాద్‌లోని బేగంపేటలో గల దేవనార్ పబ్లిక్ స్కూల్‌లోని అంధ పాఠశాలలో చదువుకుంది. పదో తరగతిలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. ఇంటర్ జహీరాబాద్‌లోని మాస్టర్ మైండ్ కళాశాలలో చేసింది. అనంతరం చెన్నైలోని సత్యభామ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో చేరి బీబీఏ కోర్సు పూర్తి చేసింది. 2023లో నిర్వహించిన ఐఐఎం కోర్సు కోసం పరీక్ష రాసి దేశంలోని 21 ఐఐఎం కళాశాలల్లోని 19 కళాశాలల్లో అర్హత సాధించింది. అందులో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ ఐఐఎంను ఎంపిక చేసుకుంది. ఈనెల 23వ తేదీన కళాశాలలో చేరనున్నట్లు ఆమె పేర్కొంది.

అధిక రేటుకు పుస్తకాలు విక్రయం

- స్వయంగా ముద్రించి అమ్మకాలు
- ప్రైవేట్ పాఠశాలల స్టోర్ రూమ్‌లను సీజ్ చేసిన విద్యాశాఖ సిబ్బంది
- డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా


పాఠశాలలో పుస్తకాలను తనిఖీ చేస్తున్న విద్యాశాఖ సిబ్బంది

హుస్నాబాద్: ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు కాకుండా స్వయంగా ముద్రించి అధిక రేటుకు పుస్తకాలు అమ్ముతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జీ.శివరాజ్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని శ్రీ చైతన్య, మాంటిస్సోరి పాఠశాలల్లో అధిక ధరలకు అమ్ముతున్న పాఠ్య పుస్తకాలను డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు పట్టుకున్నారు. వీరి సమాచారంతో విద్యాశాఖ సిబ్బంది వచ్చి స్టోర్ రూమ్‌లను పరిశీలించి పుస్తకాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా శివరాజ్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు వ్యాపారమే ధ్యేయంగా పని చేస్తున్నాయని ఆరోపించారు. విద్యాసంవత్సరం ప్రారంభంలోనే టై, బెల్ట్‌లు, డ్రెస్సులు, షూలను, పాఠ్య పుస్తకాలు అమ్ముకుంటూ విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీకి గురి చేస్తున్నారని తెలిపారు. 1వ తరగతి పుస్తకాలు రూ.3 వేలకు అమ్ముతున్నారని, అడ్మిషన్ల ఫీజుల పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి రూ.2వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, రవీందర్, సంపత్, అరవింద్, సాయి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రాలపై దాడులు

- 840 సిలిండర్లు, 9 గూడ్స్ వాహనాలు స్వాధీనం
- నలుగురు నిందితులు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రూపేశ్


నిందితులను చూపుతున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్: అక్రమంగా నిర్వహిస్తున్న గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రాలపై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడులు నిర్వహించారు.ఈ ఘటన పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్పీ రూపేశ్ గురువారం తన కార్యాలయంలో కేసుకు సంబంధించి వివరాలు వెల్లడించారు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామంలోని రోహన్ ట్రేడర్స్ యజమాని పిట్లంకు చెందిన బొక్క శ్రీనివాస్ ఇస్నాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇతడు ప్రజలు గృహ అవసరాలకు వినియోగించే డోమెస్టిక్ గ్యాస్‌ను అక్రమంగా కొనుగోలు చేసి తన ట్రేడర్స్ గోడౌన్‌లో రీఫిల్లింగ్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. గురువారం నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి 9 గూడ్స్ వాహనాలు, 73 ఫుల్ గ్యాస్ సిలిండర్లు, 661 ఖాళీ గ్యాస్ సిలిండర్లు మొత్తం 734 సిలిండర్లతోపాటు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. అదే విధంగా ఇస్నాపూర్ గ్రామం సాయి కాలనీకి చెందిన మాదిరి రవీందర్ అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్నట్లు గుర్తించారు. అతడి వద్ద నుంచి 3 తూకం మిషన్స్, 3 గ్యాస్ రీఫిల్లింగ్ మిషన్స్, 53 ఫుల్ గ్యాస్ సిలిండర్లు, 53 ఖాళీ గ్యాస్ సిలిండర్లు మొత్తం 106 స్వాధీనం చేసుకున్నారు. ఈ మొత్తాన్ని పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అదుపులోకి తీసుకున్న శ్రీనివాస్, రవీందర్, రాజు, ప్రవీణ్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.